నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, బుధవారం 4 డిసెంబర్ 2024 | NIZAMABAD

## రేపు జిల్లాకు బీసీ డెడికేటేడ్ కమిషన్ రాక

కంఠేశ్వర్, డిసెంబర్ 3: స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లను అమలుచేసేందుకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన బీసీ డెడికేటేడ్ కమిషన్ ఈనెల 5న జిల్లాకు రానున్నదని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ కుల సంఘాలు, ప్రజాప్రతినిధులు, ఇతర కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను కమిషన్ స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు బీసీ డెడికేటేడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర్‌రావుకు జిల్లాలోని ఆయా కులాల స్థితిగతులపై ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చని సూచించారు.



వినాయక్‌నగర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులు వేస్తున్న తెలంగాణ జాగృతి ప్రతినిధులు

## శ్రీకాంతాచారికి ఘన నివాళి

ఖలీల్‌వాడి, డిసెంబర్ 3: ఉమ్మడి జిల్లాలో మంగళవారం తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి 15వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ జాగృతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న అమరవీరుల స్తూపం వద్ద శ్రీకాంతాచారి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాగృతి నాయకులు మాట్లాడుతూ.. శ్రీకాంతాచారి ప్రాణ త్యాగం యావత్ దేశ ప్రజలను ఉద్యమానికి మేల్కొలిపిందని పేర్కొన్నారు. తన అమరత్వంతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన శ్రీకాంతాచారిని ఈ తెలంగాణ గడ్డ ఎప్పటికీ మరువబోదన్నారు. ఆయన అడుగుజాడల్లో తెలంగాణ జాగృతి ముందుకు వెళ్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాగృతి నాయకులు అవంతిరావు, లక్ష్మీనారాయణ భరద్వాజ్, పులి జైపాల్, పంచరెడ్డి మురళి, శ్రీనివాస ఆర్యా, ఘనపురం దేవేందర్, శోభ, సరిత, సంతోష్, శ్రీకాంత్, సందీప్ పాల్గొన్నారు.



# నూరు శాతం అబద్ధం

## రుణమాఫీపై సర్కారు అసత్య ప్రచారం

- వంద శాతం మాఫీ చేశామన్న సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రభుత్వ ప్రకటనకు భిన్నమైన పరిస్థితి
- క్షేత్ర స్థాయిలో మాఫీ కాని రైతులు లక్షల్లోనే..
- ఉమ్మడి జిల్లాలో 1.77 లక్షల మందికి ధోకా
- రైతువేదికలకు పరుగులు తీస్తున్న కర్షకులు
- సమాధానం చెప్పడంలో యంత్రాంగం వైఫల్యం

నిజామాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రేవంత్ సర్కారు అబద్ధాలకు అంతే లేకుండా పోయింది. చేసే పనులకు, చెప్పే మాటలకు పొంతనే ఉండడం లేదు. రైతులందరికీ రూ.2 లక్షల లోపు పంట రుణాలు మాఫీ చేస్తామన్న కాంగ్రెస్ పార్టీ.. పూర్తి స్థాయిలో అమలు చేయలేక చేతులెత్తేసింది. కానీ, వంద శాతం రుణమాఫీ చేశామని రేవంత్‌రెడ్డి ప్రకటించడం రైతులను గందరగోళంలోకి నెట్టేసింది. క్షేత్ర స్థాయిలో లక్షలాది మంది అన్నదాతలకు రుణమాఫీ వర్తించనే లేదు. రూ.లక్షలోపు ఉన్న రుణాలు సైతం మాఫీ కాలేదు. నాలుగో విడుత జాబితాలోనూ పేర్లు లేకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇదేది పట్టని ప్రభుత్వం మాత్రం నూటికి నూరు శాతం రుణమాఫీ చేశామని చెప్పడం కర్షకులను కలవరపాటుకు గురి చేస్తున్నది.

**వ్యవసాయ శాఖ నిర్లిప్తత**

రుణమాఫీ గందరగోళానికి వ్యవసాయ శాఖ పనితీరే ప్రధాన కారణం. జాబితా రూపకల్పనలో చోటు చేసుకున్న తప్పిదాల మూలంగా రైతులు నష్టపోతున్నారు. మరోవైపు సొసైటీల్లోనూ రుణాల రికార్డుల నిర్వహణలో గందరగోళమూ ఈ పరిస్థితికి కారణమైంది. పర్యవేక్షించాల్సిన జిల్లా ఉన్నతాధికారులు సైతం మిన్నకుండిపోవడంతో వ్యవసాయ శాఖ గాడి తప్పింది. కలెక్టర్ ఆదేశాలు సైతం సరిగా అమలు కావడం లేదు. రైతును ప్రభుత్వ ఉద్యోగిగా చూపించి నవ్వుల పాలైన వ్యవసాయ శాఖ కనీసం తన తప్పును సరిదిద్దుకోలేక పోయింది. అదే తప్పును నాలుగో విడుత వరకూ గుర్తించలేక చతికిలపడింది. మాక్లూర్ మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన దళిత రైతు సుమన్ ఉదంతమే జిల్లా యంత్రాంగం పనితీరుకు అద్దం పడుతున్నది. దళిత రైతుకు జరిగిన అన్యాయంపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నేతలు పట్టనట్లుగా వ్యవహరించడం గమనార్హం.

**నాలుగో విడుతలోనూ తప్పులే..**

కాంగ్రెస్ ప్రభుత్వం పంద్రాగస్టు వరకు నాలుగు దఫాల్లో రుణమాఫీ నిధులు మంజూరు చేసింది. జూలై 18న రూ.లక్షలోపు రుణాలను, జూలై 31న రూ.లక్షన్నరలోపు రుణాలను, ఆగస్టు 15న రూ.లక్షన్నర నుంచి రూ.2లక్షల వరకు రుణాలను మాఫీ చేస్తున్నట్లు తెలిపింది. నవంబర్ 30న నాలుగో విడుత నిధులు విడుదల చేసింది. పేరుకు రూ.2లక్షల్లోపు రుణాలు రద్దు చేశామని ప్రకటించుకున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. రూ.లక్ష లోపు రుణాలు ఉన్న వారికీ సైతం మాఫీ కాని రైతులు కూడా ఉన్నారు. ఒకింట్లో ప్రభుత్వ ఉద్యోగికి రుణమాఫీ మంజూరైతే, మరో ఇంట్లో అన్ని అర్హతలు ఉన్నప్పటికీ మాఫీ కాలేదు. ఇదేందని అడిగితే వ్యవసాయ శాఖ అధికారులు సమాధానం చెప్పలేక దాటవేస్తున్నారు. ఏం జరిగిందో చెప్పకుండా వస్తది పో... అంటూ గర్జిస్తూ రైతులను వెనక్కి పంపుతున్నారు. రుణమాఫీ వర్తించని వారంతా ఫోన్లు చేస్తుండడంతో ఏఈవోలు, ఏవోలు ఫోన్లు స్విచాఫ్ చేస్తున్నట్లు తెలిసింది. నిజామాబాద్ జిల్లాలో 2,03,520 మందికి పైగా రుణాలు తీసుకున్న అర్హులైన రైతులున్నారు. ఇందులో మూడో విడుతల్లో కలిపి 83,061 మందికి సంబంధించిన రూ.626కోట్లు రుణాలు మాఫీ అయ్యాయి. నాలుగో విడుతలో 17,551 మంది రైతులకు రూ.155.81 కోట్లు రుణాలు రద్దు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రకటించారు. మరీ రైతు వేదికల వద్ద రుణమాఫీ కోసం ఆందోళనకు దిగుతున్న వారు ఎవరన్నది అధికారులే సమాధానం చెప్పాలి.

### నాలుగు జాబితాల్లోనూ తప్పులే..

మూడు విడుతల్లో వెలుగుచూసిన తప్పులే నాలుగో విడుతలోనూ పునరావృతమయ్యాయి. ఆగస్టు 15 తర్వాత జరిగిన తప్పొప్పుల సవరణలో వ్యవసాయ శాఖ ఏం చేసిందన్నది చర్చనీయాంశమైంది. అధికారుల తప్పిదం మూలంగా నాలుగు విడుతల్లోనూ మాఫీ వర్తించని రైతులు రైతువేదికలకు పరుగులు తీస్తున్నారు. కానీ వారిని పట్టించుకునే వారే కరువయ్యారు. గతంలో కేసీఆర్ హయాంలో రుణమాఫీ చేసిన లెక్కల ప్రకారం పోల్చితే.. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 2,03,520 మంది రైతులున్నారు. వీరిలో 1,00,555 మందికి రూ.781 కోట్ల పంట రుణాలు రద్దయ్యాయి. ఇంకా 1,02,265 మందికి రుణమాఫీ వర్తించలేదు. కామారెడ్డి జిల్లాలో 1.76 లక్షల మంది రైతులకు గాను 1,01,417 మందికి రూ.736 కోట్ల రుణాలు రద్దయ్యాయి. ఇంకా 75 వేల మందికి రుణమాఫీ వర్తించలేదు. క్షేత్ర స్థాయిలో పరిస్థితి ఇలా ఉంటే ప్రభుత్వ మేమో నూటికి నూరు శాతం పంట రుణాలు రద్దుచేశామని అసత్యాలు వల్లే వేయడం గమనార్హం

### చెప్పింది ఒకటి..చేసింది మరొకటి



ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రూ.2లక్షలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పింది. నేను రైతును. నాకు ఇంతవరకు రుణమాఫీ కాలేదు. ఎందుకు కాలేదో అధికారులు సమాధానం చెప్పాలి. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే రూ.2లక్షలు రుణ మాఫీ అందిస్తామని వివిధ సభల్లో చెప్పారు. ఇప్పటివరకు ఆచరణకు రాలేదు.

–తీగల మహేందర్, వేల్పూర్ మండలం

### రుణమాఫీ అందరికీ చేయాలి



వేల్పూర్, డిసెంబర్ 3: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులందరికీ రుణమాఫీ అందిస్తామని చెప్పి మోసం చేసింది. కొన్ని గ్రామాల్లో కొందరికే రుణమాఫీ చేసి అందరికీ చేశామని చెబుతున్నది. నాకు రూ. 2 లక్షల రుణం ఉంది..కానీ ఇంతవరకు మాఫీ కాలేదు.

– పాలెపు బాలరాజు, మోతె, వేల్పూర్ మండలం

## విద్యార్థులు చనిపోతున్నా పట్టదా!

- నిరంకుశంగా వ్యవహరిస్తున్న రేవంత్ సర్కార్
- బీఆర్ఎస్వీ ప్రతినిధుల ఆగ్రహం
- కామారెడ్డి పట్టణంలో 'గురుకుల బాట'
- విద్యార్థుల సమస్యలను తెలుసుకున్న నాయకులు
- సరంపల్లి ట్రైబల్ స్కూల్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

కామారెడ్డి, డిసెంబర్ 3 : కామారెడ్డి జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్వీ ప్రతినిధులు మంగళవారం గురుకుల బాట పట్టారు. కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్, బీఆర్ఎస్ యూత్ టౌన్ ప్రెసిడెంట్ చెలిమల భాను ప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణంలోని ట్రైబల్ డిగ్రీ కళాశాల, మైనార్టీ జూనియర్ కళాశాలను సందర్శించారు. కళాశాలలో నెలకొన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణ శివారులోని సరంపల్లిలో ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలకు వెళ్లడానికి యత్నించగా..ప్రిన్సిపాల్ అనుమతించలేదు. పోలీసులను రప్పించి బీఆర్ఎస్వీ నాయకులను బలవంతంగా స్కూల్ బయటికి పంపించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ నాయకులు మాట్లాడుతూ.. నిరంకుశంగా వ్యవహరిస్తున్న రేవంత్ సర్కార్ గురుకులాల విద్యార్థులు చనిపోతున్నా పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. విద్యార్థి సమస్యలపై పోరాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులపై దౌర్జన్యం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకు గురుకులాల్లో 50 మందికిపైగా విద్యార్థులు చనిపోయినా పట్టించుకోవడంలేదన్నారు. విద్యారంగంపై కనీసం సమీక్ష చేయకుండా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు తరిమికొట్టే రోజు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. విద్యార్థులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వమూ కూడా పతనం కాకతప్పదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు మారుతి, శీను, సాయి, బుల్లెట్ సాయి, పరుశురామ్ గౌడ్, సాయి కృష్ణ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్వీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

## కొందరికే రుణమాఫీ




విలేకరులతో మాట్లాడుతున్న రైతు జేఏసీ నాయకులు ప్రభాకర్, లింగారెడ్డి

- ఆరు అబద్ధాలు, 66 మోసాలు
- రైతుకు రాని భరోసా.. కానరాని యువ వికాసం
- మీడియా సమావేశంలో రైతు జేఏసీ నాయకులు

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్3: ఎన్నికల్లో కాంగ్రెస్ గ్యారంటీల గారడి చేసి ప్రజలను మోసం చేసిందని ఆర్మూర్ డివిజన్ రైతు జేఏసీ నాయకులు అన్నారు. మంగళవారం వారు పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు ఇట్టెడి లింగారెడ్డి, ప్రభాకర్ మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ, పంటలకు బోనస్, రైతు భరోసా పేరుతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి.. రైతులను మోసం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ వాగ్దానాలు ఎండమావిలా మారాయన్నారు. ఒక గ్రామంలో 300 మంది రైతులు ఉంటే, అందులో కేవలం 30 మందికి మాత్రమే నాల్గో విడుత వరకు రుణమాఫీ అయినట్లు తెలిపారు. మండలంలోని మంథని గ్రామంలో ఇంకా 300 మందికిపైగా రైతుల (పదిశాతం)కు రైతు రుణమాఫీ కాలేదన్నారు. ఎన్నికల్లో ఆరు అబద్ధాలు ఆడి 66 మోసాలు చేసిందన్నారు. రైతులకు 'భరోసా'లేదని, రైతు కూలీలకు 12వేల భృతి మాయ మాటలే అన్నారు. రెండు లక్షల రుణమాఫీ అరకొరే మందికే చేశారని తెలిపారు. వరికి రూ.500 బోనస్ ఉత్తమాటే అని పేర్కొన్నారు. ఆడబిడ్డలకు ఇప్పటికీ రూ. 2,500 అందలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఎంతశాతం మేర అమలుచేశారో కాంగ్రెస్ పార్టీ నాయకులకే తెలుసున్నారు. త్వరలో రైతు ఆందోళన కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు.

## 'చొక్కయ్యగుట్ట' బ్రహ్మోత్సవాలు



మండల కేంద్రంలోని చొక్కయ్యగుట్ట వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం స్వామి కల్యాణోత్సవం నిర్వహించగా.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరయ్యారు. గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో పల్లకీని మోశారు.

–భీమ్‌గల్, డిసెంబర్ 3

## జాతీయ రహదారిపై చిరుత ప్రత్యక్షం

### రోడ్డు దాటుతుండగా ఢీకొన్న గుర్తు తెలియని వాహనం



జాతీయ రహదారిపై గాయాలతో చిరుత

ఇందల్వాయి, డిసెంబర్ 3 : కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం దగ్గి శివారులోని 44వ జాతీయ రహదారిపై ఓ చిరుత మంగళవారం రాత్రి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొన్నది. దీంతో చిరుత కాళ్లకు గాయాలవడంతో కదలలేక కొద్దిసేపు రోడ్డుపై అలాగే పడిపోయింది. సమాచారం అందుకున్న ఇందల్వాయి ఎఫ్ఆర్వో రవిమోహన్ భట్, కామారెడ్డి రేంజ్ అధికారి రమేశ్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన చిరుతను పరిశీలిస్తుండగా వెంటనే లేచి అటవీప్రాంతంలోకి వెళ్లినట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు.


